





విద్యార్థులు, ప్రజాప్రతినిధుల తిరంగా ర్యాలీ



డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

# మత్తు పదార్థాలకు దూరంగా వుండండి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు.అజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా చిత్తూరులో బుధవారం గాంధీ విగ్రహ కూడలి నుంచి నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీని ఎమ్మెల్యే జగన్మోహన్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు బానిసలు కాకూడదన్నారు.పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ చిత్తూరు నియోజకవర్గాన్ని డ్రగ్‌ఫ్రీగా చేయడానికి ప్రజలు కూడా సహకారం అందించాలన్నారు. మేయర్ అముద, ఏఎస్పీ రాజశేఖర రాజు, డీఈవో వరలక్ష్మి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. అర్హులకు శాపం

- 16,500 మంది అన్నదాతలకు అందని సుఖీభవ నిధులు
- 25,300 మందికి జమ అవ్వని తల్లికి వందనం సొమ్ము
- రెవెన్యూ, సచివాలయ సిబ్బంది చొరవతోనే పరిష్కారం
- ఉన్నతాధికారులు దృష్టి పెట్టకుంటే ప్రభుత్వానికి మచ్చే

చిత్తూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు స్కూల్‌కు వెళ్లే పిల్లలందరికీ 'తల్లికి వందనం' పథకాన్ని వర్తింపజేశారు. రైతులకు మేలు చేసేలా 'అన్నదాతకు సుఖీభవ' లబ్ధిని పెంచారు. కానీ, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో కొంతమంది అర్హులు ఈ రెండు పథకాలకు దూరమయ్యారు. వాళ్ల ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాల మేరకు వీరికి లబ్ధి అందకుండా పోయింది.

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇంట్లో ఒకరికే అమ్మ ఒడి డబ్బులు వేసేవారు. అలా అప్పట్లో 1.52 లక్షల మందికి రూ.13 వేల చొప్పున జమయ్యేది. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చాక స్కూల్‌కు వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని అమలు చేసింది. జూన్ నెలారంభంలో జిల్లాలోని 2.60 లక్షల మంది పిల్లలు రూ.13 వేలు చొప్పున సాయం పొందారు.ఒక ఇంట్లో ఐదుగురు పిల్లలున్నా రూ.13వేల చొప్పున డబ్బులు వేశారు. అయితే 25,300 మందికి ఈ నిధులు జమ కాలేదు.ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లిస్తున్నారని, ఎక్కువ పొలముందని, 300 యూనిట్లకు మించి కరెంటు వాడుతున్నారని సచివాలయ సిబ్బంది నమోదు చేసేశారు. ఆధార్, బ్యాంకు అకౌంట్‌కు లింక్ అవ్వకపోవడం, బ్యాంకు అకౌంట్ ఫ్రీజ్ అవ్వడం వంటి కారణాలను అధికారులు చెబుతున్నారు కానీ, అన్నీ సక్రమంగా ఉన్నా నిధులు జమ కానివారు వేలల్లోనే వున్నారు. ఆయా పాఠశాలలు, సచివాలయాల నుంచి అర్హుల సమాచారాన్ని తెప్పించుకుని లబ్ధి అందేలా చేయాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.



యాదమరి మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన ఆటో డ్రైవర్ జి.బాలాజి శెట్టికి ఇద్దరు కుమారులు. చిత్తూరులోని ప్రైవేటు స్కూల్‌లో అరుణ్‌సాయి పదో తరగతి, దివ్యచరణ్ ఎనిమిదో తరగతి చదువుతున్నారు. ఇద్దరికీ తల్లికి వందనం నిధులు జమ కాలేదు. దీంతో స్థానిక సచివాలయంలో జూన్ 18న ఫిర్యాదు చేశారు. బ్యాంకుకు వెళ్లి అకౌంట్, ఆధార్ లింకేజీను.. ఈకేవైసీ వంటి వాటిని చెక్ చేసుకున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా డబ్బులు పడలేదు.

బంగారుపాళ్యం మండలం ముంగరమడుగుకు చెందిన సమారియా కొడుకు శామ్యూల్ రాబర్ట్ చిత్తూరులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. తల్లి ఖాతాలో డబ్బులు జమ కాలేదు. సచివాలయానికి వెళ్లి విచారిస్తే ఇన్‌కమ్‌ట్యాక్స్ చెల్లిస్తుండడం, నెలకు రూ.12 వేలు జీతం వస్తుండడంతో అర్హత సాధించలేదన్నారు. దీంతో సమారియా షాక్ అవ్వాల్సి వచ్చింది. ఎందుకంటే వారికున్న 2.5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకోవడం తప్ప మరే వ్యాపకం వారికి లేకపోవడమే.



యాదమరికి చెందిన జి.బాబుకు ఎకరా పొలముంది. కేంద్రం అందించే పీఎం కిసాన్ రూ.2 వేలు ఇతని ఖాతాలో జమైంది. రాష్ట్ర ప్రభుత్వం అందించే అన్నదాత సుఖీభవ నిధులు రూ.5వేలు మాత్రం జమ కాలేదు. సచివాలయానికి వెళ్లి విచారిస్తే, సిబ్బంది నిర్లక్ష్యంతో సంబంధిత పోర్టల్‌లో చనిపోయినట్లు నమోదు చేసిన విషయం చూసి నిర్ఘాంతపోవాల్సివచ్చింది.

వైసీపీ హయాంలో రైతు భరోసా పేరుతో పథకాన్ని అమలు చేసేవారు. కేంద్రం మూడు విడతల్లో ఇచ్చే రూ.6 వేల పీఎం కిసాన్ సాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.7 వేలను ఇచ్చేది. మొత్తంగా రైతులకు రూ.13 వేలు పలు విడతల్లో అందేది.ప్రస్తుత ప్రభుత్వం అన్నదాతకు సుఖీభవ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ సాయాన్ని రెట్టింపు చేసింది. అంటే అప్పట్లో రూ.7 వేలు ఇస్తే, ఇప్పుడు దాన్ని రూ.14 వేలకు పెంచింది. కేంద్ర సాయం రూ.6 వేలతో కలిపి రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందుతుంది. తొలి విడత కింద జిల్లాలోని 2.05 లక్షల మందికి రూ.5 వేల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. రెవెన్యూ సమస్యలతో 16,500 మంది రైతులకు ఈ పథకం వర్తించలేదు. రీసర్వే, వెబ్‌ల్యాండ్ సమస్యల్ని రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడం ఓ కారణమైతే, రైతుల వివరాలను సచివాలయ సిబ్బంది సరిగా పోర్టల్‌లో నమోదు చేయకపోవడం అనేది మరో కారణంగా తెలుస్తోంది. అర్హుల జాబితాలను తెప్పించుకుని రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పరిష్కరించకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరదు.



# శాంతిపురంలో 81 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్

## ఏపీఐఐసీకి భూమి కేటాయింపు

కుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె గ్రామ పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకోసం ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఇందుకోసం 81.227ఎకరాలను ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ)కు కేటాయిస్తూ బుధవారం ప్రత్యేక జీవో జారీ చేసింది. గ్రామ పరిధిలోని 441, 442, 443, 444, 445, 464, 465, 466, 472,477,478, 479,480,481,646సర్వే నెంబర్లలో గల భూమిని ఇందుకోసం నిర్దేశించింది. ఇక్కడ భూమి మార్కెట్ విలువ ఎకరాకు రూ.4.60 లక్షలున్నట్టు పేర్కొంది. కేటాయించిన భూమికి సంబంధించి జీవోలో ప్రత్యేక నిబంధనలు విధించింది. ఏపీఐఐసీకి కేటాయించిన భూమిని ప్రభుత్వ అనుమతి లేకుండా అమ్మడం, లీజుకు ఇవ్వడం లేదా ఇతర విభాగానికి బదిలీ చేయడం నిషేధం. అలాగే నీటి వనరులున్న భూభాగం బదిలీకి అనుమతి లేదు. ఉన్న నీటి వనరులను అలాగే కాపాడాలి. నీటి ప్రవాహాలు, సహజసిద్ధమైన నిర్మాణాలను మార్పు చేయకూడదు. అనుమతి లేకుండా భూమిపై ఎటువంటి నిర్మాణాలూ చేయరాదు. కాగా శాంతిపురం మండలం తమ్మిగానిపల్లె గ్రామ పరిధిలో ఏపీఐఐసీకి కేటాయించిన భూమిలో ఇప్పటికే కృషి విజ్ఞాన కేంద్రం, మదర్ డెయిరీ మంజూరయ్యాయి. ప్రస్తుతం భూమి ఏపీఐఐసీ పరం కావడంతో వాటి ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

# బోధన ఎగ్గొట్టే టీచర్లకు చెక్

## విద్యాశాఖలో ఈ-హాజరు విధానం అమలు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పని మీద జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వెళుతున్నట్లు కొంతమంది టీచర్లు లీప్ యాప్‌లో స్పెషల్ డ్యూటీ కింద నమోదు చేసి బయటకు వెళుతున్నారు. పాఠశాల పని కోసం కాక ఎక్కడికో వెళ్లి అక్కడున్న పాఠశాలలో హాజరు వేసి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఉప ఖజానాధికారి కార్యాలయానికి వెళుతున్నామనే సాకు చూపుతూ హెచ్‌ఎంలు సైతం సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారనే వాదనలు లేకపోలేదు. ఇలాంటి వాటికి చెక్ పెట్టే దిశగా విద్యాశాఖ ఈ-హాజరు విధానాన్ని తెరపైకి తెచ్చింది. హాజరు విధానంలో కీలక మార్పులు చేస్తూ, విద్యా వ్యవస్థలో చాలాకాలంగా కొనసాగుతున్న అసంబద్ధ విధానాలకు అడ్డుకట్ట వేసింది.

**పాఠశాల పనిపై బయటకు వెళ్లే వారు ఇక నుంచి ఇలా చేయాలి**

ఎప్పటిలాగే లీప్ యాప్‌లో స్పెషల్ డ్యూటీకి దరఖాస్తు చేసుకోవాలి. కొత్త విధానం ద్వారా డీడీవో (డ్రాయింగ్ డిస్‌బర్స్‌మెంట్ అధికారి)లాగిన్‌కు ఈ హాజరు వెళుతుంది. దరఖాస్తు చేసిన వారి వివరాలు, పని కోసం వెళ్లిన ప్రాంతానికి చెందిన అంశాలు, రేఖాంశాలతో సహా అధికారికి తెలిసిపోయేలా యాప్‌ను రూపొందించారు. లీప్‌యాప్‌లో అధికారి పేర్కొన్న వివరాలు, ఉద్యోగి వెళ్లిన చోటు ఒకటి అయితేనే ఓటీపీ ద్వారా డీడీవో టీచర్‌కు స్పెషల్ డ్యూటీని అప్రూవ్ చేస్తారు. అప్పుడే టీచరు హాజరు నమోదవుతుంది. లేని పక్షంలో లీప్ యాప్‌లో హాజరు తిరస్కరిస్తుంది. దీంతో ఆ టీచరు విధులకు గైర్హాజరైనట్లు చూపిస్తారు. దీనికి తోడు ప్రత్యేక పనిపై బయటకువెళ్లిన ఉద్యోగి అక్కడి సంబంధిత అధికారిని కలిసినట్లు డీడీవో స్వయంగా ఫోన్‌ద్వారా తెలుసుకుంటారు. ఈ విధానం విద్యాశాఖలో అమలులోకి రావడంతో చీటికిమాటికి పాఠశాలలు ఎగ్గొట్టి బయట తిరిగే టీచర్లకు చెక్ పడినట్లయింది.

## అందుబాటులో 3100 టన్నుల యూరియా

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు 3100 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. ఇటీవల వర్షాలు పడిన నేపథ్యంలో పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావడంతో యూరియా కొరత లేకుండా చూసేందుకు జిల్లా వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పలు దఫాలుగా యూరియా కేరళ నుంచి జిల్లాకు వస్తోంది. ఈ క్రమంలో బుధవారం వంద మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

## డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో టాపర్ నవీన్‌కుమార్



రామకుప్పం, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాల్లో రామకుప్పం మండలం నారాయణపురం తాండాకు చెందిన నవీన్‌కుమార్‌నాయక్ విశేష ప్రతిభ కనబరిచాడు.ఎస్జీటీ విభాగంలో 84.5 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచాడు.

# కుప్పం నేతలకు పదవుల పంట



డాక్టర్ సురేశ్‌బాబు

కుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం టీడీపీ శ్రేణులు ఎదురు చూస్తున్న నామినేటెడ్ పదవులు భర్తీ అయ్యాయి. పలమనేరు - కుప్పం- మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎం-ఉడా) ఛైర్మన్‌గా డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం గ్రామీణ విద్యుత్తు సహకార సంస్థ (రెస్కో) ఛైర్మన్‌గా వీజీ.ప్రతాప్, కుప్పం వ్యవసాయ మార్కెట్టు కమిటీ (ఏఎంసీ) ఛైర్మన్‌గా జి.మునిరాజు, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కమిటీ వైస్ ఛైర్‌పర్సన్‌గా భారతీ త్రిలోక్‌లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఆస్పత్రి కమిటీకి స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. వీటిలో పీకేఎం-ఉడాకు తప్ప మిగిలిన కమిటీలన్నింటికీ సభ్యులను సైతం నియమించింది.

### రెస్కో



వీజీ.ప్రతాప్

ఛైర్మన్‌గా వీజీ.ప్రతాప్ కుమార్ (కుప్పం), వైస్ ఛైర్మన్‌గా జి.విశ్వనాథ్ (రామకుప్పం), సభ్యులుగా కుప్పం పట్టణానికి చెందిన ఆర్ముగం, పి.శివ, ఎస్ఎస్.తులసీనాథ్, సి.మురళి, హరోహరన్, శాంతిపురం మండలానికి చెందిన జీఎస్.అనసూయ, బసవరాజు, ఆర్.శరణ్ కుమార్, గుడుపల్లె మండలానికి చెందిన మునివెంకటప్ప ,ఎం.బాలగంగాధర్, అమీర్ బాషా,రామకుప్పం మండలానికి చెందిన ఎస్.విజయ కుమార్ , పి.సతీశ్ నియమితులయ్యారు.

### కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ



జి.మునిరాజు

ఛైర్మన్‌గా జి.మునిరాజు (గుడుపల్లె), వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎస్.ప్రియా శరవణ (కుప్పం), సభ్యులుగా రామకుప్పం మండలానికి చెందిన మునేంద్ర నాయక్,పవన్ కుమార్,గుడుపల్లె మండలానికి చెందిన గోపి , కళావలి ఉదయ్ కుమార్,భానుమతి,కుప్పం మండలానికి చెందిన ఎస్.వల్లియప్ప,జి.తులసిబాబు , సుకన్య,ఆస్మా ఇర్ఫాన్,వడివేలు, శాంతిపురం మండలానికి చెందిన చంద్రకళ,అనితా హరినాథ్‌రెడ్డి, శ్యామలా దేవి నియమితులయ్యారు.

### కుప్పం ఏరియా ఆస్పత్రి కమిటీ



భారతీ త్రిలోక్

స్థానిక ఎమ్మెల్యే హోదాలో చంద్రబాబు ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు.వైస్ ఛైర్‌పర్సన్‌గా కుప్పం మండలానికి చెందిన భారతీ త్రిలోక్, సభ్యులుగా కుప్పం మండలానికి చెందిన ఎం.రేఖ , రామకుప్పం మండలానికి చెందిన విజయకుమార్ రెడ్డి ,గుడుపల్లె మండలానికి చెందిన డాక్టర్ ప్రశాంత్,శాంతిపురం మండలానికి చెందిన యూజీ.కాశీనాథ్ , మంజునాథ్ గౌడ్ నియమితులయ్యారు.



## ముసురు మబ్బుల్లో తిరుమల

తిరుమలలో బుధవారం చిరు జల్లులు, చల్లగాలులతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. వానమబ్బులు కమ్మేసి తెల్లవారుజాము నుంచీ వాన కురుస్తూనే ఉంది. భక్తులు తడుస్తూనే తిరిగారు. సాయంత్రానికి చలి పెరిగింది. వరుస వానలతో కొండచరియలు జారే ప్రమాదం ఉన్నందున ఘాట్‌రోడ్లలోని కొన్ని ప్రాంతాల్లో విజిలెన్స్, ఫారెస్ట్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తిరుపతిలోనూ ఎడతెరపిలేని చిరుజల్లులు పడ్డాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

## స్విమ్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఇంటర్వ్యూ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ వైరాలజీ విభాగంలోని కాంట్రాక్టు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 6న నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకాగలని రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా బుధవారం ఒక ప్రకటనలో కోరారు. స్విమ్స్‌లోని పాత డైరెక్టర్ కార్యాలయ కమిటీ మందిరంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించే ఈ ఇంటర్వ్యూకు అభ్యర్థులు ఒరిజినల్, నకలు సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. 40 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు.

## సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

**సోమవారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు**
**మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,596**
**తలనీలాలు సమర్పించినవారు: 31,565**



# తిరుపతి దక్షిణ దశ మారుతోంది

- వేగంగా ఎన్‌హెచ్ 716 విస్తరణ
- ఏడాదిన్నరలో అందుబాటులోకి..



**మొత్తం రోడ్డు నిర్మాణం:** 37.43కి.మీ
**మల్లవరం నుంచి రేణిగుంట (కేఎల్ఎం సర్కిల్)దాకా:** 17.40 కి.మీ
**తమిళనాడు/ఏపీ సరిహద్దు పుత్తూరు సెక్షన్:** 20.03కి.మీ
**ఇరువైపులా సర్వీస్ రోడ్డు దూరం:** 32 కి.మీ
**నిర్మాణ వ్యయం:** రూ.862.11కోట్లు
**నిర్మాణ సమయం:** రెండు సంవత్సరాలు
**పూర్తి చేయాల్సిన తేదీ:** 13-12-2026
**నిర్మాణ సంస్థ:** టీపీఎఫ్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్, వాయాన్స్ సొల్యూషన్స్ లిమిటెడ్

**తిరుపతి నగరం దక్షిణ దిశగా విస్తరణకు మార్గం సుగమం కానుంది. నగరానికి దక్షిణంగా ఉన్న పల్లెల ప్రజలకు జాతీయ రహదారిని దాటడం అనే ప్రాణాంతక సమస్యకు పరిష్కారం లభిస్తోంది. ఆరు వరసలుగా విస్తరణ జరుగుతున్న జాతీయ రహదారిపై కొత్త ఫ్లైవోవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఇందువల్ల రోడ్డు ప్రమాదాలకు అవకాశముండదు. ట్రాఫిక్ జామ్‌లు ఉండవు.**

తిరుపతి-ఆంధ్రజ్యోతి

చిత్తూరు-నాయుడుపేట ఆరు లేన్ల రహదారిలో సి.మల్లవరం నుంచి రేణిగుంట కేఎల్ఎం కూడలి దాకా మాత్రమే నాలుగు లేన్ల రహదారి ఉండిపోయింది. దీన్ని కూడా ఆరు లేన్ల రహదారిగా విస్తరించే పనులు జోరుగా సాగుతున్నాయి. 17.40 కిలోమీటర్ల దూరం ఉన్న ఈ రహదారిపై కొత్తగా మూడు ఫ్లైవోవర్లు, 5 అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నారు. సర్వీస్ రోడ్లు ఉంటాయి. 'యాక్సెస్ కంట్రోల్డ్ హైవే' గా రూపుదిద్దుకుంటున్న ఈ జాతీయ రహదారి తిరుపతి నగర విస్తరణలో కీలక పాత్ర పోషించబోతోంది. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ 2024 నవంబరు 5న దీనికి నోటిఫికేషన్ జారీ చేసింది. దీనికి ఎన్‌హెచ్ 716గా నామకరణం చేశారు. ఇప్పటివరకు 11 శాతం పనులు పూర్తయ్యాయి. ఏడాదిన్నరలో పూర్తిగా అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం విస్తరణ పనులతో పాటు రామానుజపల్లె, మల్లవరం వద్ద అండర్ పాస్ పనులు మొదలుపెట్టారు.

### యాక్సెస్ కంట్రోల్డ్ హైవే ప్రత్యేకతలు

వేగంగా, సురక్షితంగా వాహనాలు ప్రయాణించేలా ఈ హైవే నిర్మాణం జరుగుతోంది. హైవేను క్రాస్ చేసే అవసరం ఎక్కడా ఇక ఉండదు. హైవేకి సమాంతరంగా అటూ, ఇటూ సర్వీస్ రోడ్లు ఉంటాయి. హైవే మీదకు ఎక్కడానికీ, దిగడానికీ ఈ సర్వీస్ రోడ్లలో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు ఉంటాయి. పశువులు హైవే మీదకు వచ్చే వీలే లేకుండా బారికేడ్లు నిర్మిస్తారు.



గందరగోళం.. కెఎల్ఎం సర్కిల్



ఇక్కడ కూడా ఫ్లైవోవర్ వస్తుంది

### మూడు ఫ్లైవోవర్లు

హైవేపై మూడుచోట్ల ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. ప్రస్తుతం కేఎల్ఎం ఆసుపత్రి కూడలి గందరగోళంగా ఉంటుంది. తిరుపతి నుంచి నాయుడుపేట వైపునకు వెళ్లే ఆరు వరసల హైవేలోంచి చెన్నైకి నాలుగు వరసల కూడలి చీలుతుంది. ఇదే కూడలిలో రేణిగుంట నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఇక్కడ ఎటు నుంచి ఎటు తిరగాలో అర్థంగాక వాహనదారులు గందరగోళపడుతుంటారు. నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతుంటాయి. అలాగే మల్లవరం కూడలి కూడా ప్రమాదాలకు దారితీసేలా ఉంది. ఈ రెండు కూడళ్ల వద్దా ఫ్లైవోవర్లు నిర్మించనున్నారు. అలాగే అవిలాల క్రాసింగ్‌లో మరొక ఫ్లైవోవర్ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ నిత్యం ట్రాఫిక్ ఆగిపోతూ ఉంటుంది. ప్రమాదాలు జరుగుతూ ఉంటాయి.

### ఐదు అండర్ పాస్‌లు

మల్లవరం కూడలి నుంచి కేఎల్ఎం కూడలి దాకా అనేక చోట్ల హైవేను క్రాస్ చేయాల్సి ఉంటుంది. ఇది ప్రమాదాలకు దారితీస్తోంది. ఆర్సీపురం, పచ్చికాపలం వరకూ ఉన్న పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఇందుకు పరిష్కారంగా అడర్‌పాస్‌ల నిర్మాణం జరుగుతోంది.

- పేరూరు జంక్షన్, రామానుజపల్లె చెక్‌పోస్ట్ జంక్షన్‌లలో భారీ వాహనాలు సైతం వెళ్లేలా(వీయూపీ) అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.
- తనపల్లి క్రాస్, తిరుచానూరు జంక్షన్‌లలో కార్లు, మినీ వ్యాన్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లేలా ఎల్‌వీయూపీ అండర్ పాస్‌లు నిర్మిస్తారు. ఇది 4.5 మీటర్ల ఎత్తు ఉంటుంది.
- ఎమ్మార్‌పల్లి - మల్లవరం రోడ్డులో ఉప్పరపల్లి జంక్షన్‌లో కార్లు, బస్సులు వెళ్లేలా (ఎస్‌వీయూపీ)అండర్ పాస్ నిర్మిస్తారు. ఈ అండర్‌పాస్ 5.5మీటర్ల ఎత్తు ఉంటుంది.



ఆదమరిస్తే అంతే.. తిరుచానూరు జంక్షన్



ఇక్కడ అండర్‌పాస్ నిర్మిస్తారు



డేంజరస్ సర్కిల్ .. ఈ తనపల్లి క్రాస్

### టోల్ తప్పదు

యాక్సెస్ కంట్రోల్డ్ హైవే మీదకు నగరంలో నుంచి ఎక్కాలనుకుంటే మాత్రం టోల్ ఫీజు చెల్లించాలి. ప్రస్తుతం హైవేపై మేర్లపాక వద్ద, పాకాల వద్ద టోల్ ప్లాజాలు ఉన్నాయి. ఇవి కాకుండా సర్వీస్ రోడ్డులోంచి ఎక్కే దగ్గర కూడా టోల్‌బూత్‌లు పెడుతారు. హైదరాబాద్‌లోని అవుటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్ల తరహాలో ఇవి ఉంటాయి. కింది ప్రాంతాల్లో టోల్‌బూత్‌లు ఉంటాయి. ఎంటర్ చేసిన ప్లాజా నుంచి ఎగ్జిట్ ప్లాజా వరకు ప్రయాణ దూరం ఆధారంగా టోల్ వసూలు చేస్తారు. రెండు బస్ షెల్టర్లు కూడా ఏర్పాటు చేస్తారు.

- తిరుపతి నుంచి మదనపల్లె వెళ్లే మార్గంలో సీ.మల్లవరం జంక్షన్ వద్ద
- శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వెళ్లే వైపు తొండమనాడు దగ్గర
- ఆర్సీపురం జంక్షన్ (అవిలాల క్రాస్) వద్ద
- గాజులమండ్యం జంక్షన్ (ఫ్లైఓవర్ కింద చెన్నై మార్గంలో )
- నగరి దగ్గర రెండు

### ఈ కూడలి ప్రమాదకరం



ప్రస్తుతం హైవేల్లో మర్రిగుంట కూడలి అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఎయిర్ పోర్టు వైపునుంచి తిరుపతి వైపునకు వస్తున్నపుడు రేణిగుంట చెక్‌పోస్టు నుంచి ఒక రోడ్డు వచ్చి కలుస్తుంది. ఈ కూడలి గందరగోళంగా ఉండడంతో వేగంగా ప్రయాణించే వాహనాలు హఠాత్తుగా ఎటు మళ్లాలో అర్థం కాక సడన్ బ్రేకు వేసి పల్టీలు కొడుతున్నాయి. ఇక్కడ సురక్షితమైన కూడలి గానీ, ఫ్లైవోవర్ గానీ అవసరం.

## ఇంటి సమీపానికి ఒంటరి ఏనుగు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఒంటరి ఏనుగు పెరట్లోకి రావడంతో ఆ కుటుంబ సభ్యులు వణికిపోయారు. ఎర్రావారిపాలెం మండలం చింతగుంట పంచాయతీ చిన్నరామాపురానికి చెందిన నల్లకుంట్ల సుధాకర్ నాయుడికి ఊరికి ఆనుకొని పొలం ఉంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో ఇంటి పక్కనే వున్న పశువుల నీటి తొట్టెలో ఓ ఏనుగు నీరు తాగుతుండటం చూసి ఆ రైతు తీవ్రభయాందోళన చెందారు. ఆయన కుమారుడు ధైర్యంగా వెళ్లి ఇంటి ఆవరణలోని ట్రాక్టర్‌ను స్టార్ట్ చేసి హారన్ మోగించడంతో గజరాజు నెమ్మదిగా అడవిలోకి వెళ్లిపోయింది. అప్పటికే చెరకు, టమోటా, కూరగాయల పంటలను తిని ధ్వంసం చేసింది. ఫారెస్టు అధికారులు ఏనుగుల సంచారం ఇవ్వడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తొట్టెలో నీరు తాగి వెళ్లిపోతున్న ఏనుగు

## ఉచిత ఇసుక విధానం భేష్

- పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం లోడింగ్, రవాణాలకు నామమాత్రంగా ఛార్జీలను తీసుకుంటూ ఉచితంగా ఇసుకను అందించడం గొప్ప విషయమని ఎస్ఎల్‌వీ గ్రూప్ అధినేత పెనుమత్స శ్రీనివాస రాజు కొనియాడారు. టీడీపీ అధికారంలో ఉన్నంత కాలం ఏటా పాదయాత్రగా తిరుమల వస్తానని మొక్కుకున్న ఆయన క్రమంలో కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 13న విజయవాడలో పాదయాత్ర ప్రారంభించి బుధవారం అలిపిరికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షలా మారిందన్నారు. ఫలితంగా నిర్మాణాలు నిలిచిపోయి అభివృద్ధికి ఆటంకంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వం కేవలం రూ. 200 లోడింగ్, రవాణా ఛార్జీలతోనే ఇసుక అందించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. పదిరోజుల క్రితం చేపట్టిన పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసి శ్రీవారి వద్దకు చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు.



గరుడ సర్కిల్ వద్ద కుటుంబ సభ్యులతో పెనుమత్స

## రుయాకు బ్రోన్కోస్కోప్ వితరణ

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): యశోదా ఆస్పత్రుల ఇంటర్వెన్షనల్ పల్మలనాజిస్ట్ డాక్టర్ హరికిశన్ రుయాస్పత్రిలోని పల్మనాలజీ విభాగానికి రూ.5 లక్షల విలువచేసే బ్రోన్కోస్కోప్‌ను అందించారు. బుధవారం రుయాలో ప్రిన్సిపాల్ రవిప్రభు, సూపరింటెండెంట్ రాధలకు దాన్ని అప్పగించారు. రుయాస్పత్రిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు దాతలు ముందుకు రావడం చాలా గొప్ప విషయమని వారు పేర్కొన్నారు. ఇటువంటి ఖరీదైన వైద్య పరికరాలతో శ్వాసకోశ వ్యాధులను ముందుగానే గుర్తించి, వైద్యం అందించే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, వైద్యాధికారులు మధుసూదన్, మనోహరన్, అజయ్‌కుమార్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లకు బ్రోన్కోస్కోప్‌ను అందజేస్తున్న వైద్యులు

## రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నామని డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలను మాత్రమే యథావిధిగా కొనసాగిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం



**బహుమతులు ప్రదానం చేస్తున్న షార్ డైరెక్టర్ పద్మకుమార్, పక్కన ముఖ్య అతిథి రామస్వామి, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు**

సూళ్లూరుపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో బుధవారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ మాట్లాడుతూ చంద్రయాన్-3 మిషన్ ద్వారా ఇస్రో 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువం ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను విజయవంతంగా సాఫ్ట్ ల్యాండింగ్ చేయడంతో భారత్ కీర్తి పెరిగిందని, ఈ విజయానికి గుర్తుగా ఆ రోజును జాతీయ అంతరిక్ష దినోత్సవంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాల్లో 7 చోట్ల ఈనెల 4 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ మాజీ కార్యదర్శి టి.రామస్వామి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలపై అవగాహన పెంచుకొంటే శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. అంతరిక్ష పరిశోధనలు, ఉపగ్రహాలు వాటి ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, అసోసియేట్ డైరెక్టర్ ముత్త చెర్రియన్, ఎంఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లకూరు ఉన్నత పాఠశాలలో ఏఐ కంప్యూటర్ ల్యాబ్

- దాతృత్వం చాటుకున్న ఎన్నారై వెంకటతేజ పేరం



**ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌లో విద్యార్థులు, వెంకటతేజ కుటుంబ సభ్యులు**

పెళ్లకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ విప్లవం నడుస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ప్రవాసాంధ్రుడు వెంకటతేజ పేరం అన్నారు. తన స్వగ్రామమైన పెళ్లకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెంకటతేజ యంగ్ మైండ్స్ ఏఐ హబ్ పేరుతో అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. తన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పేరం మధుసూదన్ నాయుడు, జ్యోతమ్మ, పేరం రమేష్‌నాయుడు, చంద్రబాబు నాయుడు, సందీప్‌తేజ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటతేజ వీడియో ద్వారా తన సందేశాన్ని విద్యార్థులకు అందించారు. తాను పుట్టిన ఊళ్లో విద్యార్థులు ఏఐ టెక్నాలజీపై అవగాహన పెంచుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే ఉద్దేశంలో యంగ్ మైండ్స్ ఏఐ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ల్యాబ్ ద్వారా కృతిమ మేధస్సు(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్) రోబోటిక్స్ కోడింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ డేటా సైన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక రంగాల్లో శిక్షణ అందిస్తామన్నారు. తద్వారా సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యం పెరిగి అంతర్జాతీయ స్థాయిలో పోటీపడే అవకాశం లభిస్తుందన్నారు.ల్యాబ్ ఏర్పాటుకు సహకరించిన తన స్నేహితులు కార్తిక్‌రాజు, నిమిష్, వసంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థులు ఏఐ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని సాంకేతిక రంగంలో రాణించాలని పేరం సోదరులు ఆకాంక్షించారు. ఎంఈవో వెంకటేశ్వర్లు, నాయకులు గాలి రాజేష్ నాయుడు, విజయ్‌కుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు,భైనా చంద్రశేఖర్‌రెడ్డి, అక్కరపల్లి గోపాల్‌రెడ్డి, నాగేంద్రప్రసాద్ రెడ్డి, చైతన్యకృష్ణారెడ్డి, మునీష్, తిరుపాల్ నాయుడు పాల్గొన్నారు.

## గజదాడుల నివారణకు ప్రణాళిక రూపొందించండి

- తలకోనలో అధికారులకు కలెక్టర్ ఆదేశం



ఎర్రావారిపాలెం, ఆగస్టు 13: పంట పొలాలపై ఏనుగుల దాడుల నివారణకు పకడ్బందీ ప్రణాళిక రూపొందిచాలని అటవీశాఖ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. అదే సమయంలో ఏనుగుల రక్షణ ముఖ్యమన్నారు. వన్య ప్రాణులు, అటవీ సంరక్షణకు సంబంధించి బుధవారం ఆయన తలకోనలో అధికారులతో సమావేశం నిర్వహించారు. అడవుల్లో వన్య ప్రాణుల రక్షణకు అనువైన వాతావరణం కల్పించాలన్నారు. అటవీ,వన్య ప్రాణుల చట్టలను కఠినంగా అమలు చేస్తూ మరోపక్క పంట పొలాలపైకి ఏనుగుల దాడుల కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టం జరగకుండా, రైతులు ప్రాణాలు కోల్పోకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ వివేక్, సీసీఎఫ్ఓ సెల్వం, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మూషిక వాహనంపై గణనాథుడు



పాకాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఊట్లవారిపల్లె సమీపంలోని ఆనందగిరి (పాళ్యంకొండ)పై వళ్లీ దేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆడికృత్తిక బ్రహోత్సవాలు బుధవారం ఉదయం శ్రీకారం చుట్టుకున్నాయి. ఉభయదారులు ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం కలశ స్థాపన హోమం జరిగింది. రాత్రి వినాయకస్వామి మూషికవాహనంపై ఊరేగి భక్తులను కటాక్షించారు. అయిదు రోజుల పాటు వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈనెల 17న జరిగే ఉత్సవానికి భారీగా భక్తులు తరలిరానున్నారు.

## తిరుపతి కలెక్టర్‌కు స్కోచ్ పురస్కారం




కందులవారిపల్లె, శ్రీరామపురంలో ఇళ్ల మీద ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ - కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. న్యూఢిల్లీకి చెందిన స్కోచ్ సంస్థ ఏటా ఈ పురస్కారాలను ఇస్తోంది. స్వర్ణనారావారిపల్లె కింద సి.రామాపురం, కందులవారిపల్లె, రంగంపేట పంచాయతీల్లో 45రోజుల్లో 1,600 గృహాలకు సోలార్ రూఫ్ టాప్ సిస్టమ్‌ను ఏర్పాటు చేశారు. దీనికిగాను కలెక్టర్ స్కోచ్‌కు ఎంపికయ్యారు. వచ్చే నెల 20న ఢిల్లీలో అవార్డు అందుకోనున్నారు. సీఎంచంద్రబాబు ప్రోత్సాహం, జిల్లా అధికారుల సహకారంతో ఇది సాధ్యమైందని కలెక్టర్ వెంకటేశ్వర్ 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. కలెక్టర్‌ను బుధవారం రాత్రి జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్ఈ సురేంద్రనాయుడు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది అభినందించారు.

## 15 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా పుంగనూరులో 9.6, సదుంలో 5.6, బైరెడ్డిపల్లిలో 4.8, చౌడేపల్లి, గంగాధరనెల్లూరు మండలాల్లో 3.0, గుడుపల్లెలో 2.6, రొంపిచెర్ల, ఐరాల, పెద్దపంజాణి మండలాల్లో 2.4, పలమనేరులో 2.0, పెనుమూరు, గంగవరం, తవణంపల్లె మండలాల్లో 1.2, చిత్తూరు అర్బన్, వి.కోట మండలాల్లో 1.0 మిమీ వర్షపాతం నమోదయ్యింది. నాలుగు మండలాలు తప్ప మిగిలిన 28 మండలాల్లో ఆగస్టు నెల సగటు వర్షపాతం కంటే అధిక వర్షపాతం నమోదైంది. చౌడేపల్లిలో 120.3 మిమీ బదులు 100.0 మిమీ, శాంతిపురంలో 101.6 మిమీ బదులు 83.0 మిమీ, కుప్పంలో అతితక్కువగా 112.0 మిమీ బదులు 41.8 మిమీ, గుడుపల్లెలో 106.5 మిమీ బదులు 93.2 మిమీ వర్షం కురిసింది.

## 16న జడ్పీ సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ, శనివారం ఉదయం 10.30 గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. సమావేశానికి కలెక్టర్, ప్రజాప్రతినిధులు, సభ్యులు హాజరవుతారని, జిల్లా స్థాయి అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

## పార్థసారధికి రాజ్‌భవన్ ఆహ్వానం



పార్థసారధినాయుడు

చిత్తూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన సేవాతత్పరులు, మాజీ కౌన్సిలర్ పర్వతరెడ్డి పార్థసారధినాయుడికి రాజ్‌భవన్ ఆహ్వానం పలికింది. సామాజిక సేవతో పాటు కొవిడ్ సమయంలో ఆయన చేసిన సేవా కార్యక్రమాలను ప్రభుత్వం గుర్తించింది. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా ఆయన్ను ఆహ్వానించారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి మంగళవారం కలెక్టరేట్‌కు సమాచారం అందింది.

## ఉచిత బియ్యం పంపిణీ గడువు రేపటితో ముగింపు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు ఈనెల 1 నుంచి ప్రారంభమైన ఉచిత బియ్యం పంపిణీ గడువు శుక్రవారంతో ముగియనుంది. 5,34,721 రేషన్‌కార్డులకు బదులు బుధవారం వరకు 88.73 శాతం అనగా 4,74,412 కార్డుదారులకు ఉచిత బియ్యం, నగదుకు అరకిలో పంచదార పంపిణీ చేసింది. పోర్టబిలిటీ ద్వారా 92,453 కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. చౌకదుకాణాల ద్వారా జరిగిన పంపిణీలో రాష్ట్రస్థాయిలో చిత్తూరుజిల్లా 11వ స్థానంలో నిలిచింది.

## గిరిజన గురుకుల పాఠశాలలో.. మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

రామకుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని ప్రభుత్వ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు ఉన్న మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్టు ప్రిన్సిపాల్ రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో నాలుగో తరగతిలో 33, ఐదో తరగతిలో 25, ఆరో తరగతిలో 19, ఏడో తరగతిలో 5, ఎనిమిదో తరగతిలో 5, తొమ్మిదో తరగతిలో 12 చొప్పున మిగులు సీట్లు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20లోపు నేరుగా పాఠశాల కార్యాలయంలో దరఖాస్తులు అందించి అడ్మిషన్లు పొందాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 8500968128 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

## నవోదయలో ప్రవేశానికి గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయలో 2026-27 విద్యాసంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే గడువు ప్రక్రియ ఈనెల 27 వరకు పొడిగించినట్లు నవోదయ ప్రిన్సిపాల్ గీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎస్వీయూ స్టేడియంలో స్వాతంత్ర్య దిన వేడుకలు

తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం జరిగే 79వ జిల్లాస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకల వేదిక మారింది. రెండు రోజుల వర్షానికి పోలీసు పరేడ్ మైదానం బురదమయం కావడంతో ఎస్వీయూ స్టేడియానికి మార్చారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఇందులో భాగంగా అధికారులు స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు. పోలీసుల కవాతు, విన్యాసాలపై ఏఆర్ డీఎస్పీ చంద్రశేఖర్, రిజర్వుడ్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ రమణ నేతృత్వంలో రిహార్సల్ నిర్వహించారు. కాగా, వేదిక మార్పును గమనించి ప్రజాప్రతినిధులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ఎస్వీయూ స్టేడియంలో జరిగే వేడుకలకు హాజరుకావాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు కోరారు. ఇక, వివిధ శాఖల శకటాలు, స్టాళ్ల ఏర్పాట్లలో డీఆర్డీఏ, డ్వామా అధికారులు నిమగ్నమయ్యారు. కాగా, గురువారం అతి భారీ వర్షం పడితే.. తుడాకు సంబంధించి కచ్చిపి ఆడిటోరియంలోనైనా వేడుకలు నిర్వహించాలని యంత్రాంగం భావిస్తోంది. ఎస్వీయూ స్టేడియం కేంద్రంగా జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్య అతిథిగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ చేసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లా ప్రగతిపై సందేశమిస్తారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అన్ని శాఖల ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

## ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్లకు దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) కింద ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న గడువును విద్యాశాఖ ఈనెల 20వ తేదీ వరకు పొడిగించింది. ఆసక్తిగల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 25న లాటరీ పద్ధతిలో ఎంపికైన విద్యార్థుల ఫలితాలు సమగ్రశిక్ష అధికారులు వెల్లడించనున్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 31 నుంచి పాఠశాలలో ఉచిత ప్రవేశాలు పొందే అవకాశం ఉందని ఎస్ఎస్ ఏపీసీ వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధిత పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.




ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్లు - కొబ్బరిచెట్టును ధ్వంసం చేసిన ఏనుగులు

# పంటలపై ఆగని గజదాడులు

- ధ్వంసమైన పంటలను పరిశీలించిన డీఎఫ్‌వో భరణి

కల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు ఆగడంలేదు. రోజూ రాత్రి ఏనుగుల గుంపు ఎక్కడో ఒకచోట పంటలను ధ్వంసం చేస్తూనే ఉన్నాయి. దీంతో వరి, కొబ్బరి, మామిడి, అరటి, టమోటా, వంగ తదితర పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. మంగళవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు ముందుగా పాళెం పంచాయతీ కోటపల్లి వద్దకు చేరుకున్నాయి. జూపల్లి, కోటపల్లి, కట్టకిందపల్లి, కల్లూరులోని రైతులు మధుబాబు నాయుడు, బాలాజీ నాయుడు, విశ్వనాథ నాయుడు, అప్సర్, షామీర్, సుబ్బరాజులకు చెందిన మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. బుధవారం ఉదయం ఏనుగుల దాడుల్లో ధ్వంసమైన పంటలను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవోలు మధు, కృష్ణమూర్తి పరిశీలించారు. పంటల వివరాలను రైతుల నుంచి సేకరించారు.



ధ్వంసమైన పంటల ప్రాంతంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎఫ్‌వో భరణి

**డీఎఫ్‌వో భరణి పరిశీలన**

పులిచెర్ల మండలం కల్లూరు, పాళెం పంచాయతీల్లో ఏనుగుల గుంపు దాడిలో ధ్వంసమైన పంటలను బుధవారం చిత్తూరు డీఎఫ్‌వో భరణి పరిశీలించారు. ఇటీవల ఏనుగుల నుంచి పంటలను రక్షించేందుకు ఏర్పాటుచేసిన సోలార్ రిఫ్లెక్టర్ లైట్లను ఏనుగులు ధ్వంసం చేయడం గుర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏనుగుల నుంచి పంటలను కాపాడేందుకు అటవీ సరిహద్దులో సోలార్ కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ సరిహద్దు ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఏనుగుల దాడులతో పంటలు నష్ట పోయిన బాధిత రైతుల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు.

# బ్లాక్ స్పాట్లను తొలగించడానికి చర్యలు తీసుకోండి

- కలెక్టర్ సూచన



రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రతాకమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతాల వద్ద సమీపంలోని ఆస్పత్రులు, అంబులెన్స్ వివరాలు, అందుబాటులో ఉన్న బ్లడ్ గ్రూప్ వివరాలు, డాక్టర్ల వివరాలు, వారి ఫోన్ నెంబర్లతో కూడిన పూర్తి సమాచారాన్ని ఫ్లెక్సీల్లో ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, రెవెన్యూ శాఖలతో పాటు అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పూర్తి సమాచారాన్ని డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్ సిద్ధం చేయాలని చెప్పారు. జిల్లాలో ఎన్‌హెచ్-140 రహదారి పరిధిలో ఉన్న అన్ని ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, ఎన్.హెచ్ 140-2, ఎన్.హెచ్ 69-10, ఎన్.హెచ్ 42-7 (19) బ్లాక్ స్పాట్లను తొలగించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతాల్లో సౌరబ్లింకర్లు, వీధిదీపాల అమరిక, ఎంవోఆర్‌టీహెచ్ ఆమోదించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు 451 కేసులు నమోదు కాగా, ఇందులో 221 మరణించడం బాధాకరమన్నారు. జిల్లాలో 349.3 కి.మీ. రహదారులు ఉన్నాయని చెప్పారు. అవసరమైన చోట్ల జాతీయ రహదారుల అధికారులు వేగనిరోధకాలు, రంబుల్‌స్టిక్, సోలార్ లైటింగ్, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా నుంచి తిరుపతికి వెళ్లే వాహనదారులకు ముందస్తు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రహదారుల వెంట అక్కడక్కడా అక్రమంగా రోడ్లు దాటేందుకు (ఇల్లీగల్ క్రాసింగ్) ఏర్పాటు చేసిన రోడ్లను తక్షణం మూసివేయాలన్నారు. హెల్మెట్ వాడకం గూర్చి అన్ని విద్యాసంస్థల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీశాఖ అధికారి భరణి, ఆర్టీవో నిరంజన్ రెడ్డి, ఎన్‌హెచ్ఏఐ పీడీ జి.వెంకటేశ్వర్లు, డీఈవో వరలక్ష్మి, ఎన్‌హెచ్ ప్రతినిధి రషీద్, డీసీహెచ్ఎస్ పద్మావతీదేవి, ఆర్&బీ డీఈ సునీత, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఈ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన




అంబులెన్స్‌లో తిరుమలేష్‌తో నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు - అంబులెన్స్‌లో గాయాలతో తిరుమలేష్

చిత్తూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో గాయపడిన కాంట్రాక్టు కార్మికుడు తిరుమలేష్ వైద్య ఖర్చులు పూర్తిగా విద్యుత్ శాఖ భరించాలని ఆ శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం చిత్తూరులోని ఎస్ఈ కార్యాలయం ఎదుట గాయపడిన కార్మికుడు తిరుమలేష్‌ను అంబులెన్స్‌లో తీసుకొచ్చి కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నాయకులు నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... వెదురుకుప్పం మండలం యనమలమందకు చెందిన తిరుమలేష్ అదే మండలంలో అళ్లమడుగు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడడంతో తిరుమలేష్‌ను ఆ శాఖ అధికారులు విద్యుత్ స్తంభం ఎక్కించారు. మరమ్మతు పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే సిబ్బంది తమిళనాడు రాణిపేటలోని సీఎంసీకి తరలించి చికిత్స అందించారు. అధికారులు ఇచ్చిన డబ్బులు వైద్య ఖర్చులకు చాలకపోవడంతో ఆస్పత్రి వైద్యులు తిరుమలేష్‌ను డిశ్చార్జ్ చేశారు. వైద్య ఖర్చులకు డబ్బులు కావాలని అధికారులకు ఫోన్ చేస్తే స్పందన లేకపోవడంతో కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నాయకులు తిరుమలేష్‌ను అంబులెన్స్‌లో తీసుకొచ్చి స్థానిక గిరింపేటలోని ఎస్ఈ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. దీంతో వెంటనే స్పందించిన చిత్తూరు రూరల్ డివిజన్ ఈఈ సురేష్ మాట్లాడుతూ గాయపడిన తిరుమలేష్‌కు తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో మెరుగైన వైద్యం చేయిస్తామని హామీ ఇవ్వడంతో నిరసనను విరమించారు. అనంతరం అతడిని తిరుపతికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ నాయకులు హేమకుమార్, రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సురేంద్రరెడ్డి ఇంటివద్ద విలపిస్తున్న బంధువులు - పద్మమ్మ మృతదేహం వద్ద బంధువులు, గ్రామస్తులు

# విషాదముద్రలో గోవిందరెడ్డిపల్లె

గంగాధరనెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కావడి చెల్లింపుల కోసం తిరుత్తణి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం గోవిందరెడ్డిపల్లెను విషాదంలో ముంచెత్తింది.తమ్ముడిని కోల్పోయిన వైసీపీ నేత సురేంద్రరెడ్డి ఇంటివద్దకు బంధువులు తరలివచ్చారు. సురేంద్రరెడ్డి తండ్రి,వేపంజేరి సర్పంచ్ వాసుదేవరెడ్డిని పరామర్శించారు.గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లెకు చెందిన వైసీపీ నేత సురేంద్రరెడ్డి భార్య చిట్టెమ్మ, కుమార్తె కీర్తి, ఏడాది వయసున్న మనవడు శాన్విక్‌రెడ్డి, తమ్ముడు చిన్నబ్బరెడ్డి (విశ్వనాథరెడ్డి), మరదలు రేఖ, వారింట్లో పనిచేసే పద్మమ్మ కావడి మొక్కుల చెల్లింపుల కోసం మంగళవారం తిరుత్తణికి వెళుతుండగా, పళ్ళిపట్టు సమీపంలోని కుమారరాజాపేట వద్ద చిత్తూరు - తచ్చూరు హైవేలో వారు వెళుతున్న కారు ప్రమాదానికి గురైంది. పద్మమ్మ, చిన్నబ్బరెడ్డి,శాన్విక్ ఈ ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే.గాయపడ్డ చిట్టెమ్మ, కీర్తి, రేఖ రాణీపేట సీఎంసీ ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.పద్మమ్మ మృతదేహానికి పళ్ళిపట్టు పోలీసులు పోస్ట్‌మార్టం చేయించి బుధవారం సాయంత్రానికి గోవిందరెడ్డిపల్లెకు తీసుకురాగా కుటుంబసభ్యులు, బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. చిన్నబ్బరెడ్డి,శాన్విక్ మృతదేహాలకు బుధవారం వేలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్ట్‌మార్టం జరగకపోవడంతో గురువారం ఆ కార్యక్రమం పూర్తయ్యాక కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు.

## ముగిసిన సంస్కృత వారోత్సవాలు



ముగింపు సభలో మాట్లాడుతున్న గీర్వాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా జాతీయ సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన సంస్కృత భాషా వారోత్సవాలు ముగిశాయి. సంస్కృత భాషా సాహిత్యాంశాలపై నిపుణుల చేత ప్రసంగాలు, విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. ప్రతిభా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను కేరళలోని చిన్మయ యూనివర్సిటీ ప్రో-వైస్ ఛాన్సలర్ గీర్వాణి అందజేశారు. మన దేశ విజ్ఞానానికి మూలం సంస్కృతమేనని అభిప్రాయపడ్డారు. సంస్కృత వర్సిటీ వీసీ కృష్ణమూర్తి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు సంస్కృత భాషా సాహిత్యాల్లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ నారాయణరావు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం



కలెక్టర్‌తో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టే సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులందరికీ అందుతున్నాయో లేదో పరిశీలించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం ఈనెల 4వ తేది నుంచి 12వ తేదివరకు కార్వేటి నగరం, సదుం, పెద్దపంజాణి మండలాల్లో పర్యటించింది. ఇందులో భాగంగా బుధవారం వారు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. బృంద సభ్యులతో పాటు జిల్లాస్థాయి అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బృందం పర్యటించిన మూడు మండలాల్లోని ఎనిమిది తాండాల్లో కేంద్ర నిధుల ద్వారా ఏర్పాటు చేసిన ప్రభుత్వ పథకాల అమలుతీరును బృంద సభ్యులు పరిశీలించారని చెప్పారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి పెన్షన్లు, ఉపాధి హామీ, గృహనిర్మాణం, ఆర్&బీ పనులు, పంచాయతీరాజ్ పనులను పరిశీలించి వారు కేంద్రప్రభుత్వానికి నివేదిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మణికంఠన్, ప్రశాంత్ తమ పర్యటన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, డ్వామా పీడీ రవికుమార్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రేపు సాయంత్రం నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'స్త్రీ శక్తి' పథకం శుక్రవారం ప్రారంభంకానుంది. సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండులో సీఎం చంద్రబాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని లాంచనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత అన్ని జిల్లాల ప్రధాన బస్టాండ్లలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు ప్రారంభిస్తారు. సాయంత్రం 4-5 గంటల మధ్య ఈ-పాస్ యంత్రాలకు జీరో టిక్కెట్ జారీకి సంబంధించి గ్రీన్‌సిగ్నల్స్ లభించేలా చర్యలు చేపట్టారు. ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్సు వంటి రాష్ట్ర పరిధిలోని గుర్తింపు కార్డులను ఆధారంగా తీసుకుంటారు. వయస్సుతో నిమిత్తం లేకుండా జీరో టిక్కెట్ జారీ చేయనున్నారు. పథకం అమలులో ఎలాంటి లోటుపాట్లూ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బుధవారం సాయంత్రం గూగుల్‌మీట్ ద్వారా ఆర్టీసీ ప్రధాన కార్యాలయం నుంచి ఎండీ, ఈడీలు, ఇతర ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి. అన్ని విభాగాల సిబ్బందికి సెలవులు రద్దు చేయాలని, అవసరమైన మేరకు డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచాలని, బస్టాండ్లలో మౌలిక సదుపాయాలకు కొరత రాకూడదని, భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలని, రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసు సాయం తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.

## 'ఆపరేషన్ సిందూర్' వ్యాసరచన పోటీల్లో తిరుపతి వాసి విజేత



జగపతి సోమశేఖర్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో 'ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ విధానాన్ని పునర్నిర్వచించడం' అంశంపై భారత ప్రభుత్వ రక్షణ శాఖ జూన్ నెలంతా వ్యాసరచన పోటీలు నిర్వహించింది. దేశవ్యాప్తంగా 20,557 మంది పోటీల్లో పాల్గొన్నారు. 200 మందిని విజేతలుగా ప్రకటించారు. ఈ విజేతల్లో తిరుపతి దామినేడుకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జగపతి సోమశేఖర్ ఒకరు. ఆగస్టు 15న జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఆయన ప్రశంసా పత్రం అందుకోనున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఆహ్వానం అందింది.

## రేపు స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్విమ్స్ ఓపీ, ఓటీలకు సెలవు ప్రకటిస్తున్నామని డైరెక్టర్ ఆర్వీకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసర సేవలను మాత్రమే యథావిధిగా కొనసాగిస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

## సంస్కృత వర్సిటీ డీన్‌గా వెంకట్రావు



నియామక పత్రాన్ని అందుకుంటున్న వెంకట్రావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ డీన్‌గా పి.వెంకట్రావు నియమితులయ్యారు. ఈ మేరకు వీసీ కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులను అందజేసి, అభినందించారు.

# పలమనేరు
## కుప్పం/పుంగనూరు

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు ప్రతిభా అవార్డులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో విద్యార్థులు చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. బైరెడ్డిపల్లెలోని మునినారాయణ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బుధవారం కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతిభా అవార్డులు ప్రదానం చేశారు. ఉత్తమ ఫలితాలతో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కళాశాల యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల కరస్పాండెంట్ మహేష్, డైరెక్టర్లు సుమంత్, కార్తీక్ గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

## లక్కనపల్లె పాఠశాల తనిఖీ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కనపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం జడ్పీసీఈవో రవికుమార్‌నాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం అమలు, పాఠ్యాంశాల బోధన ఏవిధంగా జరుగుతుందనే అంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాల గురించి ఉపాధ్యాయులతో చర్చించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి సర్వేలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. అలాగే బైరెడ్డిపల్లెలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఆనందబాబు, డిప్యూటీ ఎంపీడీవో నాగార్జునరెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి షాలిని, హెచ్‌ఎం కవిత, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాస్, మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

## పొరుగు రాష్ట్రాల వ్యాపారులపై ఫిర్యాదు



ఎమ్మెల్యేను కలిసిన పలమనేరు వ్యాపారులు

పలమనేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు వ్యాపారుల కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానిక వ్యాపారులు బుధవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి ఫిర్యాదు చేశారు. స్థానికంగా గదులను రెట్టింపు అద్దెకు తీసుకోవడంతో పాటు నకిలీ సరుకులను తక్కువ ధరలకు విక్రయిస్తున్నారని, దీంతో గ్రామీణ ప్రజలు దోపిడీకి గురవుతున్నారని వాపోయారు. ఇలాంటి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వ్యాపారులు ఐక్యంగా ఉండాలని.. సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తానని తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌ఎంయూఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, ధనపాల్ ఆధ్వర్యంలో రెండోరోజు బుధవారం ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఖాళీల భర్తీతో పాటు పెండింగులో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలని, ఉద్యోగులకు ఓడీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ నాయకులు జి.రహంతుల్లా, రెడ్డి కిశోర్, జి.మునెప్ప, ఎస్‌పీవీ.నవీన్, కె.దిలీప్, వి.జయశంకర్, అరుణ్, బాలకృష్ణ, సి.నాయక్, ఎస్.ఆర్.రాజ, ఎల్లుస్వామి, సీసీ.మోహన్, కుమార్, బీజీ.నాయక్ పాల్గొన్నారు.

## సహకార బ్యాంకులతో రైతుల అభివృద్ధి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్ఎం తదితరులు

గుడుపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకులతో రైతులు అభివృద్ధి కావడమే సీఎం చంద్రబాబు నాయుడి ధ్యేయమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం గుడుపల్లె సింగిల్ విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సహకార బ్యాంకు కార్యాలయం ఎదుట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అంతకుముందు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సీఎం చిత్రపటాలతో ర్యాలీ చేపట్టారు. ఛైర్మన్‌గా రమేష్, డైరెక్టర్లుగా వెంకటేష్, కృష్ణప్పలచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు మెంబరు శాంతారామ్, సమన్వయ కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, మండలాధ్యక్షులు బాబు నాయుడు, మాజీ ఎంపీపీ మునిరాజు, జనసేన మండలాధ్యక్షులు అమీర్, బేటప్పనాయుడు, హేమాంబర్ గౌడ్, వెంకటేష్, మంజునాథ్, బాబు, భానుమూర్తి, వెంకటేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం బందార్లపల్లెకు చెందిన ఇందిరమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నేతలు ఇందిరమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

## 16న కృష్ణాష్టమి వేడుకలు

పలమనేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులో ఈనెల 16న త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందు జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఇందు జ్ఞానవేదిక పలమనేరు అధ్యక్షుడు రెడ్డిభాస్కర్ తెలిపారు. పలమనేరు సీఐ నరసింహరాజును ఆయన బుధవారం వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించారు. సభ్యులు జ్యోతి, సరళ, రోజా, బాలాజీ పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడికి ఎమ్మెల్యే నివాళి

బైరెడ్డిపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోట్రేపల్లెకు చెందిన టీడీపీనాయకుడు వేణుగోపాల్‌రెడ్డి రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో మృతదేహాన్ని బుధవారం పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## రెస్కో వైస్‌ఛైర్మన్‌గా విశ్వనాథ్



విశ్వనాథ్, విజయ్‌కుమార్‌రెడ్డి, కె.విజయ్‌కుమార్, సతీష్



పవన్‌కుమార్, మునీంద్రనాయక్

రామకుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) వైస్ ఛైర్మన్‌గా రామకుప్పం తెలుగు యువత మండలాధ్యక్షుడు విశ్వనాథ్ , డైరెక్టర్లుగా కొళ్ళపల్లె విజయ్‌కుమార్, గడ్డూరుసతీష్ నియామకం అయ్యారు. ఏఎంసీ డైరెక్టర్లుగా పెద్దతాండకు చెందిన టీడీపీ నేత మునీంద్రనాయక్, సింగసముద్రానికి చెందిర జనసేన మండల ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్, కుప్పం ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యుడిగా రామకుప్పం పంచాయతీ టీడీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు.

## నేడు రొంపిచెర్ల మండల సమావేశం

రొంపిచెర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన ఈనెల 14న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రొంపిచెర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు సమీపంలో ఈనెల 3న జరిగిన ప్రమాదంలో గాయపడిన గణేష్(26) బుధవారం మృతి చెందాడు. తిరుపతిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## పాముకాటుతో మహిళకు అస్వస్థత

చౌడేపల్లె, పుంగనూరు రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో ఓ మహిళ అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం చౌడేపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. చౌడేపల్లె మండలం పరికిదొన గ్రామానికి చెందిన రత్నయ్య భార్య గంగులమ్మ(50) పొలం పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి శివాడిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్సలు అందిస్తున్నారు.

## కమనీయం.. సుబ్రహ్మణ్యుడి కల్యాణం



సోమల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సోమల బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పవన్‌కుమార్ కల్యాణం చేపట్టారు. ఆలయ ధర్మకర్తలు మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, రెడ్డి జనార్దన్, సుబ్రహ్మణ్యం, పూల మురళీకృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.



● **గుడుపల్లె:** మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి దేవాలయ ఆడికృతిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించారు.

## 27 లోపు బోయకొండ పాలకవర్గ సభ్యుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చౌడేపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల కోసం ఈనెల 27 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో ఏకాంబరం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీలో 13 మంది సభ్యులు, ఒక ఎక్స్‌అఫిషియో సభ్యులు ఉంటారన్నారు. కమిటీలో ఒక బ్రహ్మణ సభ్యులతో కలిసి 6 మంది ఓసీలు, ఇద్దరు ఎస్సీ, ఎస్టీ, 5 మంది బీసీలు ఉంటారన్నారు. మొత్తంలో 6 మంది మహిళలు ఉంటారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు 30 సంవత్సరాలు వయస్సు కలిగి హిందువులై ఉండాలన్నారు. ఒక దాతకు అవకాశం ఉంటుందని, అభ్యర్థి పోలీస్ వెరిఫికేషన్ సర్టిఫికెట్, కుల, మెడికల్, ఆధార్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# పల్లె రోడ్లకు మోక్షం..!

● రూ.35 కోట్లతో శరవేగంగా మరమ్మతులు

● ఆనందంలో గ్రామీణ ప్రజలు



శాంతిపురం మండలంలోని ఎంకేపురం గ్రామంలో వేసిన సీసీ రోడ్డు



మరమ్మతులు చేయడంతో రూపురేఖలు మారిన శ్యామరాజుపురం, తిమ్మరాజుపల్లె రోడ్డు

శాంతిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలోని పల్లె రోడ్లకు మోక్షం కలిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో రోడ్ల మరమ్మతులు చురుగ్గా జరుగుతున్నాయి. రూ.35 కోట్ల నిధులతో సుమారు 70 కిలో మీటర్ల తారు రోడ్లకు, పల్లెల్లో సీసీ రోడ్లకు సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏనాడు రోడ్లపైన తట్ట మట్టి వేసిన దాఖలాలు లేవు. గ్రామీణ ప్రాంతాలకు వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ద్విచక్రవాహనదారులు గుంతలు పడి కంకరతేలిన రోడ్లలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహకారంతో పల్లె రోడ్లకు మోక్షం లభించింది. కేవలం శాంతిపురం మండలంలోనే సుమారు 70 కిలో మీటర్ల గ్రామీణ రోడ్లు బాగుపడ్డాయి. 120 సీసీ రోడ్లకు సుమారు రూ.12 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు పంచాయతీ రాజ్ ఇంజనీర్ నాగేంద్రకుమార్ తెలిపారు. వీటిలో చీమనపల్లెలో 3 రోడ్లు, కర్లగట్ట గ్రామంలో 2 రోడ్లు పూర్తి చేశారు. మిగిలిన రోడ్లనూ త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు.

అలాగే ఆర్‌అండ్‌బీ నుంచి వెంకటపల్లె-సిద్దూరు మార్గంలో 2 కిలోమీటర్లకు సుమారు రూ.50 లక్షలు, గడ్డూరు, కెనమాకులపల్లె, 121పెద్దూరు, బెండనకుప్పం మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు సుమారు 8.6 కిలోమీటర్లకు సుమారు రూ.1.85 కోట్లు, సోమాపురం, కర్లగట్ట చీమనపల్లె మీదుగా సుమారు 3 కి.మీలకు రూ.60 లక్షలు, కదిరొబనపల్లె, శ్యామరాజుపురం, పోడుచన్లు, కడపల్లె వరకు సుమారు 1.5 కి.మీలకు రూ.40 లక్షలు, గుడుపల్లె మండలం శెట్టిపల్లె నుంచి గెనికపల్లె మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు రోడ్డు పనులకు గాను సుమారు 12.9 కి.మీ వరకు సుమారు రూ.4.95 కోట్లు, కనమలదొడ్డి నుంచి రాళ్లబూదుగూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు సుమారు 9.2 కి .మీ వరకు సుమారు రూ.4.05 కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఆర్‌అండ్‌బీ డీఈ కృష్ణానాయక్ తెలిపారు.

### మూడు నెలల్లో రోడ్లకు మహర్దశ

కదిరొబనపల్లె శ్యామరాజుపురం, తిమ్మరాజుపల్లె, పోడుచేన్లు మీదుగా కడపల్లె వరకు తారురోడ్డు మరమ్మతులు పూర్తయ్యాయి. మిగిలిన మూడు నెలల వ్యవధిలో అన్ని రోడ్ల పనులు పూర్తి చేయనున్నట్లు డీఈ కృష్ణానాయక్ తెలిపారు. అలాగే నాబార్డు ద్వారా ఎంకేపురం చిన్నాగాండ్లపల్లె మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు సుమారు 5.6 కి.మీ రూ. 2 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

కొత్తపేట, శివకురుబూరు గ్రామాల రోడ్లకు నాబార్డు నుంచి నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించనున్నారు. రాళ్లబూదుగూరు, గొల్లపల్లె, శెట్టిగానికురుబూరు మార్గంలో కిలోమీటరుకు, సోన్నేగానిపల్లె, కేమి మిట్ట, సంతూరు, దండికుప్పం రోడ్డు వరకు 5.30 కి.మీ, శ్యామరాజుపురం, ఎదురుగుట్టపల్లె గ్రామాలకు, మాదనపల్లె, ప్రీతిచామనూరు, కోతిగుట్టపల్లె, కూతేగానిపల్లె, గుంజార్లపల్లె, వరదేపల్లె, దండికుప్పం, నల్లరాళ్లపల్లె గ్రామాల తారు రోడ్ల మరమ్మతులకు నాబార్డు నుంచి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు పంచాయతీ రాజ్ డీఈ మాధవనాయుడు తెలిపారు. నిధులు మంజూరైన రోడ్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ఐదేళ్లు కంకర తేలిన రోడ్లలో ప్రయాణం సాగించి అలిసిపోయిన ప్రజలు ప్రస్తుతం రోడ్లకు మరమ్మతులు చేపడుతుంటే ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పులివెందులలో విజయం టీడీపీదే

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరులో సింగిల్ విండో అధ్యక్షులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



బైరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో జరిగిన జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీదే విజయం అని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం పలమనేరులో బయప్పగారిపల్లి, పలమనేరు సింగిల్ విండో అధ్యక్షులు వెంకటరమణ(పెద్దబ్బ), జె.వెంకటమునిరెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ ఎమ్మెల్యే మాట్లాడుతూ దశాబ్దాల తరువాత పులివెందులలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగాయన్నారు. పులివెందులలో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని.. దీంతో టీడీపీ గెలుపు ఖాయమని తెలిపారు. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అన్ని వ్యవస్థలను భయపెట్టారని.. వాటిని గాడిలో పెట్టేందుకు చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పలమనేరు సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్‌వీ బాలాజీ, టీడీపీ మండలాధ్యక్షుడు నాగరాజరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **బైరెడ్డిపల్లె:** బైరెడ్డిపల్లెలో బుధవారం సింగిల్‌విండో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై సింగిల్‌విండో ఛైర్మన్‌గా నాగరాజు, సభ్యులుగా దివాకర్‌రెడ్డి, విశ్వనాథ్‌లచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సింగిల్‌విండో కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సింగిల్‌విండో ద్వారా రైతులకు సేవలందించి మంచిపేరు తీసుకురావడానికి పాలకవర్గం ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. జాతీయ బ్యాంకులకు దీటుగా సింగిల్‌విండోలను అభివృద్ధిపథంలో నడిపించడానికి కృషి చేయాలన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, పలువురు నాయకులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆర్థిక సంక్షోభంలోనూ అతివలకు ఉచిత బస్సు ప్రయాణం



విలేకర్లతో మాట్లాడుతున్న ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం

కుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా సరే.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సంసిద్ధులయ్యారని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్. మునిరత్నం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ శక్తి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్న నేపథ్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, ఆర్టీసీ కుప్పం డిపో మేనేజరు టీకే.స్వామిలతో కలిసి పీఎస్ఎం విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో దివాళా తీసిన రాష్ట్రాన్ని గట్టెక్కించి గాడిలో పెట్టడానికి శ్రమిస్తూనే ఆర్థిక కష్టనష్టాలను లెక్కచేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని చెప్పారు. స్త్రీ శక్తి పథకం కింద ఏపీఎస్ ఆర్టీసీ నడిపే 5 రకాల బస్సుల్లో మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. ఆర్టీసీలో కారుణ్య నియామకాలతో డ్రైవర్లను తీసుకుంటున్నామని తెలిపారు. కుప్పం ఆర్టీసీ బస్టాండును త్వరలోనే ఆధునీకరిస్తామని చెప్పారు. కుప్పం డిపోకు చెందిన 55 బస్సు సర్వీసుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తామని తెలిపారు.

## బస్సు ఢీకొని టెంపో డ్రైవర్ మృతి



మృతిచెందిన మునిరాజు

కుప్పం రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం నడిమూరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెంపో డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కుప్పం-కృష్ణగిరి జాతీయ రహదారిపై నడిమూరు వద్ద కుప్పం నుంచి తమిళనాడు వైపు కోళ్ల లోడ్‌తో వెళ్తున్న టెంపోను తమిళనాడు నుంచి కుప్పం వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో తమిళనాడు రాష్ట్రానికి చెందిన టెంపో డ్రైవర్ మునిరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు విధ్వంసం




పీఈఎస్ ఎదుట ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణారావు, విద్యార్థులు

కుప్పం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగంతో జీవితాలు విధ్వంసమవుతాయని పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు అన్నారు. అలాగే ర్యాగింగ్ చేయడం మానవ హక్కుల ను ఉల్లంఘించడమేనని, ఈ రెండు నేరాలకు చట్టపరమైన కఠిన శిక్షలు అనుభవించాల్సి వస్తుందని హెచ్చరించారు. కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాలలో బుధవారం ర్యాగింగ్ వ్యతిరేక వారం, నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల గేటు ఎదుట అధ్యాపక బృందం, వైద్య విద్యార్థులు కలిసి ఆయా కార్యక్రమాలపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించారు. ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో డీన్, ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని యువతకు సూచించారు. మత్తు పదార్థాలు అటు ఆర్థికంగా, ఇటు ఆరోగ్యపరంగా మనిషిని గుల్ల చేస్తాయన్నారు. సమాజంలో అనేక అసాంఘిక చర్యలకు మత్తు పదార్థాల వినియోగం మనుషులను ప్రోత్సహిస్తుందని, తద్వారా నేరాలు పెరిగి సమాజం దారుణంగా తయారవుతుందని చెప్పారు. సామాజికంగా, నైతికంగా మనుషులు దిగజారి చివరకు చట్టం ఎదుట నేరస్తులుగా మిగులుతారని హెచ్చరించారు. ర్యాగింగ్ చేయడమనేది ఒక వ్యక్తి హక్కులకు భంగం కలిగించడమేకాక, ఒక్కోసారి ఆయా వ్యక్తుల జీవితాలను దుర్లభం చేస్తుందన్నారు. పీఈఎస్ వైద్య కళాశాల ఆస్పత్రి, ఇతర విద్యా సంస్థల్లో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామన్నారు. అంతకుముందు ర్యాగింగ్, వ్యతిరేక, నశా ముక్త్ భారత్ సమిత సమాజాన్ని ఆశిస్తూ విద్యార్థులచే ప్రతిజ్ఞ విద్యార్థులచేత చేయించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పుంగనూరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



పుంగనూరులో హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు



పలమనేరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్, విద్యార్థులు

పుంగనూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పుంగనూరులో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని సీఐ సుబ్బరాయుడు ప్రారంభించారు. స్థానిక బసవరాజ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు జాతీయజెండా ప్రదర్శిస్తూ మానవహారం నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఎం.జగదీశ్‌రాజు, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఎస్‌ఐలు హరిప్రసాద్, వెంకటరమణ, ఎంఈవో నాగరాజరెడ్డి, మాజీ సైనికులు, బీజేపీ నాయకులు మల్లికారాణి, వెంకటరెడ్డి, పెద్దమఠంబాబు, ప్రసాద్, మణి మొదలియార్, విజయశంకర్, చంద్రశేఖర్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరులో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వి.రమాణారెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్, మాజీ సైనికులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మరుదపాండియార్స్ మొదలియార్లకు ఆదర్శం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మరుదపాండియార్స్ మొదలియార్లకు ఆదర్శనేతలని ఎమ్మెల్యే జగన్మోహన్ చెప్పారు. బుధవారం గంగినేని చెరువుపార్కులో మరుదపాండియార్స్ కాంస్య విగ్రహాలను ఏపీ మొదలియార్ సంఘం అధ్యక్షులు బుల్లెట్ సురేష్, మరుదపాండియార్స్ వారసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మరుదపాండియార్స్ 1780 నుంచి 1801 వరకు తమిళనాడులోని శివగంగై ప్రాంతాన్ని కులమతాలకు అతీతంగా పరిపాలించారని చరిత్ర చెబుతుందన్నారు. చిత్తూరు జిల్లాలో అధిక సంఖ్యలో మొదలియార్ కులస్థులు ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఏపీ మొదలియార్ సంఘం అధ్యక్షులు బుల్లెట్ సురేష్ మాట్లాడుతూ పాండియార్స్ విగ్రహ స్థాపనకు పార్టీలకు అతీతంగా సహాయ సహకారాలందించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు గాంధీ విగ్రహం నుంచి గంగినేని చెరువుపార్కు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూ జస్టిస్ పార్టీ అధ్యక్షులు ఏసీ షణ్ముగం, పాండియార్స్ వారసుడు రామస్వామి, నగర మేయర్ అముద, ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, మాజీ టౌన్‌బ్యాంకు చైర్మన్ రామ గణేష్, కార్పొరేటర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎం సహాయనిధి వరం

నింద్ర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. బుధవారం తిరుపతిలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. నింద్ర మండలం పాదిరి దళితవాడకు చెందిన అజయ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందారు. రూ.65 వేలు చెక్కును ఆయనకు ఎమ్మెల్యే అందజేశారు. టీడీపీ నాయకులు నంద రఘు, తదితరులు ఉన్నారు.



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

## రసాయనిక ఎరువులు వాడకండి

పూతలపట్టు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు పండిస్తున్న పంట పొలాలకు రసాయనిక ఎరువులు వాడరాదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పి.కొత్తకోట రైతుసేవా కేంద్రం పరిధిలో వున్న చెర్లోపల్లి గ్రామానికి చెందిన చెంగల్రాయరెడ్డి పండించిన పంట పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ రైతులు చెంగల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు ఉమా, మధురవాణి, రైతులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం

ఐరాల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గార్గేయి నదీ తీరంలో వెలసిన భద్రకాళి సమేత సంగమేశ్వర ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి, నాగలమ్మ విగ్రహాల ప్రతిష్ఠకు బుధవారం సాయంత్రం మఠంపల్లెమిట్టలో పూజలు ప్రారంభమయ్యాయి. విగ్రహాల ప్రతిష్ఠాపకులు యబ్బూరి సిద్ధయ్యశెట్టి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

## వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి బుధవారం కుటుంబ సభ్యులతో కలిసి కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని కాపాడుదాం

పూతలపట్టు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని కాపాడుదాం - భావితరాలకు ఆదర్శంగా నిలుద్దామని కమలానంద భారతీ స్వామి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని బత్తలవారిపల్లె, పంటపల్లి, నడింపల్లి, పోలవరం తదితర గ్రామాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ప్రజలు స్థానికంగా ఉన్న దేవాలయాల్లో నిత్యం పూజాకార్యక్రమాలు చేసి భక్తిమార్గంలో నడవాలన్నారు. మన దేవాలయాలను, మన సంస్కృతిని, మన సమాజాన్ని మనమే కాపాడుకోవాలన్నారు.



ఆలయం వద్ద కమలానంద భారతి

## వైభవంగా కొత్తపల్లె గంగజాతర

శ్రీరంగరాజపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని 49. కొత్తపల్లెమిట్టలోని గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు విశ్వరూప దర్శనం కల్పించారు. రాత్రి గజమాలతో బాణసంచా వేడుకలు, భక్తుల ప్రత్యేక పూజల నడుమ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ డి.వి.డిల్యెయ్య, పవన్‌ప్రసాద్, బిగ్‌బాస్, మైకేల్, నాగేంద్రన్, సతీష్, ముని, తవముని, గ్రామస్తులు పూర్తి చేశారు.



## ఆరు గ్రావెల్ టిప్పర్ల సీజ్



విజయపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాజపురంలో వేరు వేరు బిల్లులతో వెళుతున్న ఆరు టిప్పర్లను సీజ్ చేసినట్టు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. జాతీయ రహదారి పనులకు గ్రావెల్ మట్టి తరలించకుండా తమిళనాడు వేరు వేరు ప్రాంతాల బిల్లులతో గ్రావెల్ తరలిస్తున్నారని ఆరోపణలు రావడంతో బిల్లులను పరిశీలించి సీజ్ చేశారు. బుధవారం మైనింగ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు టిప్పర్ మట్టిని అంచనా వేశారు. టిప్పర్ సాధారణంగా 25 మెట్రిక్ టన్నులు తీసుకెళ్ళాలని, కానీ 37.5 మెట్రిక్ టన్నులను ఓవర్ లోడ్‌తో తరలించినట్టు తెలిపారు. మండలంలో శాశ్వత ప్రాతిపాదికన ఉన్న 8 గ్రావెల్ క్వారీల్లో పనులు జరుగుతున్నాయా లేదా అని వివరాలు సేకరించారు. శాశ్వత క్వారీలు ఏవీ జరగడం లేదని స్పష్టం చేశారు. పూర్తి వివరాలు మైనింగ్ అధిరులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు జరిమానా విధిస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ టెక్నికల్ అధికారి చారి, ఎస్ఐ మహేష్‌బాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రానైట్ కార్వీలో తనిఖీ

పాలసముద్రం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆముదాల, బాలకృష్ణాపురం పంచాయతీలలో ఉన్న గ్రానైట్ క్వారీలను మైన్స్, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కడప మైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఈ క్వారీల తనిఖీ నిర్వహించారు. ఏ మేరకు గ్రానైట్‌ను తరలించారనే విషయాలపై తనిఖీ చేశారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, మైన్స్ సర్వేయర్ విమల, సచివాలయ సర్వేయర్లు చరిత, సౌజన్య, దీప, వీఆర్వోలు రమేష్‌నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

● శ్రీరంగరాజపురం: మండలంలోని కటికపల్లె రెవెన్యూ పరిధిలో పిల్లిగుండ్లపల్లె సమీపంలో కొంతమంది అనుమతి లేకుండా క్వారీలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో తహసీల్దార్ లోకనాథం పిళ్లై, ఎస్ఐ సుమన్, మండల సర్వేయర్ సురేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు తనిఖీ చేశారు.

● యాదమరి: మండలంలోని పరదరామి బీట్ కమ్మపల్లి, గొందివాళ్ళవూరు పరిధిలోని క్వారీలను మైన్స్ ఆర్ఐ శ్రీనివాసులు, తహసీల్దార్ పార్థసారథి, సర్వేయర్ తులసీధర్, ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూఅధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు.

## పోగొట్టుకున్న బంగారు గొలుసు అప్పగింత

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి బుధవారం ఒంగోలుకు చెందిన ఓ వ్యక్తి విచ్చేశారు. సాయంత్రం ఆయన స్వామి దర్శనానికి వెళ్లే క్రమంలో దారిలో తన బంగారు గొలుసును జారవిడుచుకున్నారు. ఆయన స్వామి దర్శనానికి వెళ్లి తిరిగి వచ్చే సమయలో గొలుసు పోయిన విషయాన్ని గమనించారు. దీంతో ఆయన కాణిపాకం ఎస్ఐ నరసింహులుకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఎస్ఐ తన సిబ్బందితో గొలుసును వెతికించగా, ఆలయ ఆవరణలో కనిపించింది. అర్ధగంట సమయంలో 36 గ్రాముల బంగారు గొలుసును కనుగొన్నారు. అనంతరం ఎస్ఐ దానిని పోగొట్టుకున్న వ్యక్తికి అందించారు.



బంగారు గొలుసును భక్తుడికి అందిస్తున్న ఎస్ఐ నరసింహులు

## కోదండ రామస్వామి సేవలో ఎమ్మెల్యే

విజయపురం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరపరాజుకండ్రిగలో సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ అష్టబంధన మహా కుంభాభిషేకం బుధవారంతో ముగిసింది. స్వామి వారి సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. రాత్రి పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. టీడీపీ నాయకులు, గ్రామస్తులు, పురోహితులు వందవాసి మహేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

పెనుమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులికల్లు పంచాయతీ మణియాణంపల్లి అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు బుధవారం మాజీ ఎంపీపీ షణ్ముగవర్మ ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కిషోర్, బాలాజీ పాల్గొన్నారు.

## విజేతకు ప్రిన్సిపాల్ అభినందన

వెదురుకుప్పం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యువజన దినోత్సవ పోటీల్లో వెదురుకుప్పం వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణశారద బుధవారం తెలిపారు. ఈ కళాశాల నుంచి వివిధ విభాగాల్లో 18 మంది విద్యార్థులు పోటీ పడ్డారని, వీరిలో బీకాం రెండవ సంవత్సరం చదువుతున్న బి.చంద్రశేఖర్‌రెడ్డికి ఫొటోగ్రఫీలో తృతీయ బహుమతి దక్కిందన్నారు. ఆ విద్యార్థికి ఆమె అభినందనలు తెలిపారు.

## మాదిగలు ఐకమత్యంగా ఉండాలి

పాలసముద్రం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పించిన ఎస్సీ వర్గీకరణ ఫలితాలను పొందాలంటే మాదిగలందరూ ఐక్యంగా ఉండాలని జిల్లా ఎంఆర్పీఎస్ నాయకుడు కిషోర్‌మాదిగ పేర్కొన్నారు. బుధవారం శ్రీబొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో మండల ఎంఆర్పీఎస్ సమావేశం నిర్వహించారు. ఎంఆర్పీఎస్ నాయకులు ప్రకాష్‌మాదిగ, శివయ్యమాదిగ, మురళిమాదిగ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల ఎంఆర్పీఎస్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎంఆర్పీఎస్ అధ్యక్షుడిగా యుగంధర్, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌ను ఎన్నుకున్నారు.

## యువ పోటీల్లో పీవీకేఎన్ విద్యార్థి ప్రతిభ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ నిర్వహించిన యువ 2025 అంతర్జాతీయ యువజనోత్సవ పోటీల్లో స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థి నిరంజన్‌కు మొదటి బహుమతి లభించింది. పెయింటింగ్ విభాగంలో ద్వితీయ బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) చదువుతున్న ఇ.నిరంజన్‌కు మొదటి బహుమతి రావడంపై కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి, అధ్యాపకులు ఆ విద్యార్థిని అభినందించారు.

## బాలికల హాస్టల్ తనిఖీ

వెదురుకుప్పం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎస్సీ బాలికల హాస్టల్‌ను బుధవారం ఎంపీడీవో పురుషోత్తం తనిఖీ చేశారు. ఈ క్రమంలో వసతి గృహ రికార్డులను పరిశీలించి, బాలికలకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట వార్డెన్ హేమలత, ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కోదండరామిరెడ్డి ఉన్నారు.

● ప్రజలకు ఐవీఆర్ఎస్ కార్యక్రమంపై అవగాహన పెంపొందించాలని ఎంపీడీవో అన్నారు. వెదురుకుప్పంలో చెత్త సేకరణ పనులను, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు.

## నేడు రైతుల ట్రాక్టర్ ర్యాలీ

పెనుమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా రైతులకు ప్రకటించిన అన్నదాత సుఖీభవ సొమ్ము రైతుల ఖాతాలో జమ చేసి ప్రభుత్వం అండగా నిలిచింది. ఇందులో భాగంగా గురువారం నిర్వహించే రైతుసంబర సభకు హాజరవుతున్న ఎమ్మెల్యే థామస్ పెనుమూరు మండలం పులిగుండు వద్ద నుంచి పెనుమూరు మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొంటారని చెప్పారు.

## ఈ కల్వర్టును బాగుచేయరూ...!

చిత్తూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల పడిన వర్షాలకు మిట్టూరులోని రంగారెడ్డి వీధికి వెళ్లే మార్గంలో కాలువపై నిర్మించిన కల్వర్టు కుంగిపోయింది. కాలువపై వేసిన బండరాళ్లు కాలువలోపలికి ఒరిగిపోయాయి. దీంతో ఈ మార్గం ప్రమాదకరంగా మారింది. దీంతో వర్షం పడినప్పుడల్లా వరదనీరు మురుగుతో కలిసి రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ మార్గంలో కార్లు, ఆటోలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రుల్లో ద్విచక్రవాహనదారులు కల్వర్టుపై పడి గాయాలపాలవుతున్నారు. గత 10 రోజులుగా నలుగురు ప్రమాదాల బారినపడ్డారు. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవలేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టును బాగు చేయాలని కోరుతున్నారు.



కల్వర్టు కుంగిపోవడంతో మురుగు కాలువకు అడ్డంగా పడిన రాళ్లు

## వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన గణపతి విగ్రహం, హోమం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిగెలపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గణపతి, దక్షిణమూర్తి, మహాలక్ష్మి, విద్యాసరస్వతి విగ్రహాల ప్రతిష్ఠతతో పాటు కుంభాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. పాతవెంకటాపురం పంచాయతీ గరిగెలపల్లెలో మూడోరోజు బుధవారం అర్చకులు ఆలయం వద్ద హోమం, కలశపూజలు నిర్వహించిన అనంతరం ప్రధాన ఆలయ గర్భగుడిలో గణపతి విగ్రహం, ఆలయగోపురంపై కలశాల ప్రతిష్ఠతో పాటు అష్టదిక్పాలకు ఆహ్వానం, మహామంగళహారతి పూజలను ఘనంగా చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే ఆర్.గాంధీ, పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, సింగిల్‌విండో సొసైటీ మాజీ వైస్‌చైర్మన్ బాబు నాయుడులను నిర్వాహకులు సన్మానించి, ప్రసాదాలను పంపిణీచేశారు.

## 'అన్నదాత సుఖీభవ' రానివారి జాబితా సిద్ధం చేయాలి

పెనుమూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగి రెవెన్యూ పొరపాట్ల వలన అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కానివారి జాబితాను సిద్ధం చేశామని, వారి సమస్యలు పరిష్కరించాలని వీఆర్వో, అగ్రికల్చర్ అధికారులకు తహసీల్దారు శ్రావణ్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో వారితో తహసీల్దారు సమావేశం నిర్వహించారు. డీటీ వాణి, వ్యవసాయ అధికారి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## సీఆర్‌కండ్రిగ కార్యదర్శిపై ఎంపీడీవో ఆగ్రహం

పెనుమూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీఆర్‌కండ్రిగ సచివాలయ కార్యదర్శిపై ఎంపీడీవో కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పీ4 సర్వేలో మండలంలోనే సీఆర్‌కండ్రిగ వెనుకబడినందున ఆ సచివాలయంలో ఆయన పలు రికార్డులు పరిశీలించారు. సర్వేలో వెనుకబడటంపై ఆయన సిబ్బందిని అడిగారు. ఎవరి అనుమతీ లేకుండా కార్యదర్శి విధుల్లో లేకపోవడంతో ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి మాట్లాడాలని సిబ్బందితో చెప్పి వెళ్లిపోయారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు కార్యదర్శి రాకపోవడంతో అతడిపై చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

## సంకర జాతి పశువులతో అధిక పాల దిగుబడి

గుడిపాల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సంకరజాతి పశువులతో పాడి రైతులు పాల దిగుబడిని పెంచుకోవాలని పీటీపీ డీడీ వాసు అన్నారు. మండలంలోని రామభద్రాపురం పంచాయతీ చుక్కావారిపల్లెలో బుధవారం పశు సంతతి పరిశీలన పథకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సంకర జాతి జర్సీ ఆవుల ద్వారా రాబోవు రోజుల్లో పాల దిగుబడి అధికమవుతుందని చెప్పారు. వీర్య కేంద్రాల్లో విత్తన కోడెలను ఉత్పత్తి చేయడమే పీటీపీ ముఖ్య ఉద్దేశమన్నారు. పశువైద్యాధికారి సాయిసుధ, ఆదిత్యనాథరెడ్డి, రామయోగానందరెడ్డి, మౌనిక, సూపర్‌వైజర్లు గిరిబాబు, కన్నయ్య, సూర్యోదయం, పాడి రైతులు కుమారు, సేల్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ అభివృద్ధే లక్ష్యంగా పని చేయండి

నింద్ర, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అభివృద్ధే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని నింద్ర మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రమైన నింద్రలో టీడీపీ మండల అనుబంధ కమిటీ ఎంపిక సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. గురువారం నగరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగే అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వసతిగృహ విద్యార్థినులకు దుప్పట్ల పంపిణీ

యాదమరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమరనాథ నాయుడు పుట్టినరోజు సందర్భంగా యాదమరి మండల కేంద్రంలోని బాలికల వసతిగృహంలో 85 మంది విద్యార్థినులకు దుప్పట్లు అందజేశారు. అమరనాథ్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. ఎంపీడీవో వేణు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ఏపీవో సంధ్యారాణి, వెటర్నరీ వైద్యులు సంధ్య, టీడీపీ మండల అధ్యక్షులు మురార్జీ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, పీఏసీఎస్ చైర్‌పర్సన్ చిత్రా నాయుడు, సర్పంచ్ హేమయ్య నాయుడు, భజలింగం, నాయకులు హేమగిరి, గుణశేఖర్, గోపి గౌడ్, నాగరాజు, రవి, వి.హరినాయుడు, వార్డెన్ సబితా పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అమరనాథ నాయుడు

## విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

నగరి, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐ విక్రమ్, కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సారా జోలికి వెళ్లకండి

పాలసముద్రం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నాటు సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని కార్వేటినగరం ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి హెచ్చరించారు. గతంలో ఆమె సారా తయారు చేసి విక్రయించే గ్రామాల్లో వారి ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించడంతో వారు ఆ వృత్తిని మానుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఎక్సైజ్ సీఐ నరసింహాపురంలో గ్రామస్తులతో మాట్లాడుతూ పాడి పశువులు మేపే వారికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ కిషోర్, హెడ్ కానిస్టేబుల్ మునిసుందరం, పోలీసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో తాగునీటి బోరుకు విద్యుత్ కనెక్షన్

యాదమరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాశిరాల పంచాయతీ పెరుమాళ్ళపెంట గ్రామంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. మూడునెలల క్రితం తవ్విన బోరుబావి నుంచి సమృద్ధిగా నీరు లభించినప్పటికీ విద్యుత్ కనెక్షన్ లేకపోవడంతో వినియోగంలోకి రాలేదు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే మురళీమోహన్‌కు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే జడ్పీ నిధుల నుంచి రూ.3 లక్షలు మంజూరు చేయించారు. దీంతో విద్యుత్ కనెక్షన్‌తో పాటు పైపులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. గ్రామస్థులు ఎమ్మెల్యే మురళీమోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## మహిళా పాడి రైతులకు కిట్ల పంపిణీ

వెదురుకుప్పం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీజ మహిళా పాడి ఉత్పత్తిదారులకు పశు సంరక్షణ కిట్లను బుధవారం కార్వేటినగరంలో ఏరియా మేనేజర్ పి.కుమార్ రాజ అందజేశారు. ఈ క్రమంలో క్యారీ బ్యాగ్స్, పశు సంరక్షణ కిట్లను పంపిణీ చేశారు. ఏరియా పీబీ అధికారి నిరోష పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు మేము వ్యతిరేకం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు తాము వ్యతిరేకమంటూ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని యాజమాన్యాల విద్యా సంస్థల్లో బుధవారం మాస్‌ప్లేట్స్ కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నషా ముక్త్ భారత్ అబియాన్ కింద కళాశాలల ప్రిన్సిపాల్స్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కుప్పంలోని ద్రావిడ యూనివర్శిటీలో 550 విద్యార్థులు, పీవీకేఎన్‌లోని 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నెట్టేరిలో పల్లెనిద్ర



పిల్లలకు విద్యా సామగ్రిని పంపిణీ చేస్తున్న డీఎస్పీ

నింద్ర, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెట్టేరిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం బుధవారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమానికి నగరి డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో సమావేశమై చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు ఉచితంగా విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నగరి రూరల్ సీఐ భాస్కర్, గ్రామస్తులు కృష్ణయ్య, వెంకటరత్నం నాయుడు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## బృందగాన విజేతలకు అభినందనలు

నగరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బృందగానంలో విజేతలుగా నిలిచినందున వారిని కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అధ్యాపకబృందం బుధవారం అభినందించారు.శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ లో అనుబంధ కళాశాలలు 15 వ్యాసరచన, వకృత్వ, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ, రంగోళి, నాటిక, బృందగానం పోటీలు నిర్వహించారు.అందులో భాగంగా బృందగానంలో నగరి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు త్రిమూర్తి, బిందు, చాందిని, జయశ్రీ, కరుణ,సాములు విజేతలకు నిలిచి బహుమతులు పొందడంతో వారిని కళాశాలలో అభినందించారు.కార్యక్రమంలో సాంస్కృతిక కోఆర్డినేటర్ అరుణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, రామానుజులు పాల్గొన్నారు.

## రైల్వే గేట్ల వద్ద అండర్, ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం వెంటనే చేపట్టండి: భానుప్రకాష్

నగరి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గ పరిధిలోని ఏకాంబరకుప్పం, పూడి, పుత్తూరు రైల్వే గేట్ కష్టాల నుంచి ప్రజల ఇబ్బందులు తీర్చడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. బుధవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో కలిసిన రైల్వే, ఆర్‌అండ్‌బీ అధికారులతో అలైన్‌మెంట్ మ్యాప్‌ను పరిశీలించి వారికి ఆదేశాలు జారీ చేశారు. రైల్వే గేట్లు ఎక్కువసేపు వేయడమే గాక ఏకాంబరకుప్పం వద్ద గల గేట్ ఇరుకుగా వుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి ఇబ్బందులు తీరేలా బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీనివాసులు, రైల్వే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నందా, ఆయా శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సహకారశాఖ ఉద్యోగుల ర్యాలీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్, సహకారశాఖ కమిషనర్ ఏ.బాబు ఆదేశాల మేరకు బుధవారం చిత్తూరు నగరంలో జిల్లా, మండల స్థాయి సహకారశాఖ సిబ్బంది అధికారులకు, రైతులకు సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను డీసీవో లక్ష్మీ సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార ఆడిట్ అధికారిణి నారాయణమ్మతో పాటు ఇతర సహకారశాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం సిబ్బందిచే సహకారచట్టంపై అవగాహన కల్పిస్తూ నగర పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

## జగన్‌తో పూతలపట్టు వైసీపీ నేతల భేటీ

పూతలపట్టు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పూతలపట్టు మండల వైసీపీ నేతలు బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పోలవరం సుధాకర్‌రెడ్డి, తలుపులపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి



జాతీయ జెండాలను స్థానికులకు ఉచితంగా ఇస్తున్న చిట్టిబాబు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు పిలుపునిచ్చారు. అందులో భాగంగా బుధవారం మిట్టూరులోని పలువురికి ఉచితంగా జాతీయ జెండాను అందజేశారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. శేఖర్, రెడ్డి మస్తాన్, హేమంత్, నాగరాజు, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్య నిర్వహణపై అవగాహన

తవణంపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాణిపాక పట్నం సచివాలయాన్ని జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎంవో ప్రవీణ్ ఆరోగ్య సిబ్బందికి పిల్లల ఆరోగ్య నిర్వహణ, పిల్లల ఆరోగ్య సమాచారం నిర్వహణపై అవగాహన కల్పించారు. డీఎస్‌వో ప్రసాద్, పీవో అనూష, డీపీవో రామ్మోహన్, వైద్యాధికారులు ప్రియాంక, మోహన్ వేలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాల లెక్కలు పారదర్శకంగా ఉండాలి: డీఆర్‌డీఏ పీడీ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాల ఆర్థిక వ్యవహారాలు పారదర్శకంగా ఉండాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి సూచించారు. బుధవారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో సిబ్బందితో ఆర్థిక వ్యవహారాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఆర్థిక కార్యక్రమాలు సాంకేతిక పరంగా కొనసాగించాలని సూచించారు. జిల్లాలో ప్రయోగాత్మకంగా యాదమరి, తవణంపల్లి మండలాల్లో తొలివిడతగా నారీ యాప్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంలు సునీత, రవికుమార్, ఏపీఎంలు మధు, సుబ్బారెడ్డి, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



వెదురుకుప్పం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఎస్ఎల్ఎస్ హైస్కూల్ బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల డైరెక్టర్ వెంకటేష్, డైరెక్టర్లు పురుషోత్తం, దిలీప్‌కుమార్, ధనంజయరెడ్డి పాల్గొన్నారు.